క్లుప్తంగా

తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చూద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: వేసవి కాలం నేపథ్యంలో మండలంలోని ఏ ఒక్క గ్రామంలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చూద్దామని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి కొత్త తీర్మానాలు లేకుండా వేసవి కాలం నేపథ్యంలో మండల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ యాదాల రత్నభారతి, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఈవోఆర్డీ కుమారి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వైపే ప్రజానీకం

- ఏపీ బలిజ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకరరావు

ఒంగోలు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆలోచనలు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వైపే ఉన్నాయని ఏపీ బలిజ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి శివశంకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో రూపొందిందన్నారు. సీఎం జగనన్న రూపొందించిన మేనిఫెస్టోలో పేద ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా రాష్ట్రంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట వేశారన్నారు. సామాజిక, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ తదితరాలను రూ.3500కు పెంచుకుంటూ పోతాననడం అభినందనీయమని తెలిపారు. కాపునేస్తం, ఈబీసీ నేస్తం, పథకాలను కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొనడం ద్వారా ఆయా వర్గాల మహిళల్లో ఉత్సాహం నెలకొందన్నారు. ఈ కార్యక్రమాలు ఆయా వర్గాల అభ్యున్నతికి దోహదపడతాయన్నారు. సీఎం జగనన్న గతంలో రూపొందించి అమలు చేసిన నవరత్నాలను కాపీ కొట్టిన చంద్రబాబు.. సూపర్ సిక్స్ అంటూ సాధ్యం కాని హామీలను ప్రచారం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి మరోసారి సీఎంగా జగనన్నను చూడాలని, జగనన్న ఇంటర్వ్యూలను టీవీలో చూసిన వారు ఎవరైనా సరే ఆయనకు ఫిదా అవ్వాల్సిందేనని అన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



వాహనాలపై సంకల్పం స్టిక్కర్లు అంటిస్తున్న డీఆర్ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రతిఒక్కరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగుల వాహనాలపై ఓటు వినియోగించుకుంటామని తెలిపేలా ప్రత్యేకంగా రూపొందించిన సంకల్పం స్టిక్కర్లను స్వయంగా ఆమె అంటించారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి రవి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రకటనలకు ముందుగానే అనుమతి తీసుకోవాలి

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు.. అనగా ఈ నెల 12, 13 తేదీల్లో పత్రికల్లో ప్రచురించే ప్రకటనలకు సంబంధించి పోటీలో ఉండే అభ్యర్థులు రెండు రోజుల ముందుగానే ఎంసీఎంసీ ధ్రువీకరణ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. పత్రికల యాజమాన్యాలు కూడా ధ్రువీకరణ ముందస్తు అనుమతి లేకుండా రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించకూడదని సూచించారు.

ఫ్యాన్‌కు ఓటేస్తేనే అభివృద్ధి పరుగులు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని కోడలు శ్రీకావ్య
- ఒంగోలు మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు రూరల్: ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని, అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు కొనసాగుతాయని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు బాలినేని శ్రీకావ్య ప్రజలకు తెలిపారు. ఒంగోలు మండలంలోని కరవది, దశరాజు మాలపల్లె, తూర్పు హరిజనవాడలో గురువారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో టపాసులు కాలుస్తూ, పూలుచల్లుతూ శ్రీకావ్యకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరవదిలో ఐదు జగనన్న లేఅవుట్ల ద్వారా వందలాది మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారని, కరవది, కొప్పోలు రోడ్డు, దశరాజుపల్లె మీదుగా ఒంగోలు రోడ్డు, ఒంగోలు–గుండాయిపాలెం రోడ్డు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఐదు డొంక రోడ్లు నిర్మించినట్లు వివరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ను జూనియర్ గర్ల్స్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. తూర్పు హరిజనవాడలో సీసీ రోడ్లు నిర్మించారని, పాడుబడిన గ్రామ చెరువును రూ.60 లక్షలతో ఆధునికీకరించారని తెలిపారు. ఇవన్నీ గుర్తుంచుకోవడంతో పాటు మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రీకావ్య కోరారు. కార్యక్రమంలో మేడికొండ కోటేశ్వరరావు, దార్ల బాబు, తాళ్లూరి రమేష్, మిదశల్ కృష్ణ, ఎస్.అంకారావు ప్రసన్న కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మన్నె నరేష్, పెరకం సుబ్బారావు, లక్ష్మారెడ్డి, శివకుమార్, వైఎస్సార్ సీపీ నగర, రూరల్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: టీడీపీకి చెందిన 10 కుటుంబాల గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు. కండ్లగుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పావులూరి వెంకట్రావు, మురళి, దారా వెంకట్రావు, శాంతి, సుబ్బారావు, మాచవరపు నాగరాజు, చెల్లి బాలయ్య, జెట్టి సుధీర్, ఆదియ్య, పేరం కోటేశ్వరరావు వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని చూసి చాలా మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, అందరినీ కలుపుకుని పనిచేస్తానని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈమని అంజిరెడ్డి, పాలపర్తి మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు.. బాలినేని

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి
- ఒంగోలు అభివృద్ధికి సహకరించండి
- 31వ డివిజన్‌లో బాలినేని శచీదేవి ఇంటింటి ప్రచారం



31వ డివిజన్ విజయనగరకాలనీలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న బాలినేని శచీదేవి

ఒంగోలు అర్బన్: ఎవరు ఏ సహాయం అడిగినా కాదనకుండా అందరినీ సొంతవారిగా భావించి సహాయం చేసే మంచి వ్యక్తి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అని ఆయన సతీమణి బాలినేని శచీదేవి కొనియాడారు. స్థానిక 31వ డివిజన్‌లోని విజయనగరకాలనీ, మోడల్ టౌన్ ప్రాంతాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, నాగేశ్వరరావుతో కలిసి ఇంటింటికి తిరిగారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశారని చెప్పారు. రోడ్లు, కాలువలు, పార్కులు, డివైడర్లు, కల్వర్టులు నిర్మించి నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. భారీ వర్షం కురిసినా.. నగరంలో ఎక్కడా నీరు నిల్వకుండా చర్యలు చేపట్టారన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ప్రజలంతా ఓట్లేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని, జగన్‌ను సీఎం చేసుకుని నగరాన్ని మరింత తీర్చిదిద్దేందుకు సహకరించాలని శచీదేవి కోరారు. సచివాలయాలు, వలంటీర్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇదేవిధంగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలు అందజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 22 వేల మంది పేదలకు ఎమ్మెల్యే బాలినేని ఇళ్ల స్థలాలు అందజేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, మళ్లీ గెలిపిస్తే ఇళ్లు కూడా నిర్మించి ఇస్తారని తెలిపారు. ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ప్రతిరోజూ తాగునీరు ఇచ్చేలా ఏర్పాటు చేసేందుకు బాలినేని సంకల్పించారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు స్వరూప్, ఎస్సీసెల్ నాయకుడు మిడసల మధు, మాజీ కౌన్సిలర్ గుంజి ఏడుకొండలు, నాయకులు విస్సు, వల్లెపు మధు, మురళి, శివకృష్ణ, రవి, రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో శచీదేవి ప్రచారం...

ఒంగోలు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి అన్నారు. ఒంగోలులోని 9వ డివిజన్‌లో గురువారం మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 9వ డివిజన్‌లో డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల ద్వారా సుమారు రూ.30.98 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం సుమారు రూ.7.53 కోట్లు ఖర్చుచేసి డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పార్కులు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఒంగోలు నగరం అభివృద్ధి చెందాలంటే బాలినేని శ్రీనివాసరెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి, డివిజన్ అధ్యక్షుడు పూర్ణ చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, పందిళ్ల గోపాలకృష్ణ, సురేష్, సుంకర శ్రీనివాసరెడ్డి, రాచమల్లు శ్రీనివాసరావు, ఆవుల రవితేజ, సీహెచ్ సువర్ణ, మరియమ్మ, వెంకటరత్నం, పున్నయ్య, వెంకటరెడ్డి, మాధవరెడ్డి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్



కృష్ణయ్యతో సమావేశంలో పాల్గొన్న శంకర్

ఒంగోలు: ఎన్నికల సమయంలో మోసపూరిత మేనిఫెస్టో ప్రకటించడం, అనంతరం విస్మరించడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్‌రావు విమర్శించారు. స్థానిక కేబీ కాన్ఫరెన్స్ హాలులో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకర్ మాట్లాడారు. టీడీపీ కూటమి మేనిఫెస్టోను నమ్మవద్దని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ గతంలో ఫెడరేషన్ల స్థానంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తుచేశారు. పైగా బీసీల తోకలు కత్తిరిస్తా అంటూ అమర్యాదగా మాట్లాడారన్నారు. కానీ, నేడు మనం అడగకుండానే జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బీసీ కులాలకు ఆరామ క్షేత్రాలకు నగరం నడిబొడ్డున స్థలం కేటాయించడంతో పాటు వాటి నిర్మాణానికి ఆర్థికంగా కూడా పెద్ద ఎత్తున అండగా నిలిచారని తెలిపారు. ఈ నేపథ్యంలో బీసీలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, యాదవ సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, కృష్ణబలిజ, భట్రాజు కార్పొరేషన్ల డైరెక్టర్లు తిర్లిక శ్రీనివాసరావు, రాజు, బీసీ విభాగం నగర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అశోక్, శ్రీకృష్ణ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు కుట్టుబోయిన కోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలినేనితోనే ఒంగోలు అభివృద్ధి

- ఒడా ఛైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి



ఒంగోలు 25వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న శింగరాజు మీనాకుమారి, డిప్యూటీ మేయర్, నాయకులు

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డితోనే నగరాభివృద్ధి సాధ్యమని ఒడా ఛైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి అన్నారు. బాలినేనిని అఖండ మెజారిటీతో ఆరోసారి గెలిపించి ఆయన సిక్సర్ విజయం సాధించే అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ గురువారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక 25వ డివిజన్‌లోని బండ్లమిట్టలో గల శింగరాజు వెంకట్రావు ఆఫీసు నుంచి ప్రచారాన్ని ప్రారంభించి దోమలపాలెం, మంగలిపాలెం, భీమరాజువారివీధి, గంటాపాలెం, కోర్టుసెంటర్ ప్రాంతాల్లో కొనసాగించారు. ఈ సందర్భంగా మీనాకుమారి మాట్లాడుతూ ఈ డివిజన్‌లో బాలినేని సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, మరింత అభివృద్ధి జరగాలంటే బాలినేని మళ్లీ గెలవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మే 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించేందుకు వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), దాసరి నారాయణరావు, డివిజన్ అధ్యక్షుడు పట్నం మధుసూదన్‌రావు, పి.సుజాత, షేక్ తుల్లి, శివ, మల్లి, అయ్యప్ప, రాఘవేంద్ర, గంటాచలం, అల్తాఫ్, షణ్ముక్, కేశవ్, గంటా ఆంజనేయులు, విక్కి, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఎంతో మేలు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి

ఒంగోలు: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం పలికేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తోడ్పడుతుందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1986, 2008, 2010, 2013, 2014 సంవత్సరాలలోనే ఈ యాక్టు కోసం ప్రయత్నం జరిగిందన్నారు. ఎన్డీఏ సర్కార్ గతంలో ఉన్న పంచవర్ష ప్రణాళికలను మార్చి నీతి అయోగ్‌ను ఏర్పాటు చేసిందని, దాని సిఫార్సుల మేరకు ల్యాండ్ టైట్లింగ్ యాక్టు డ్రాఫ్ట్ రూపొందిందని అన్నారు. 2024 డిసెంబర్ నాటికి అన్ని రాష్ట్రాలలో ఈ చట్టాన్ని అమలుచేయాలని కేంద్రం ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. అసెంబ్లీలో ఈ బిల్లుపై జరిగిన చర్చకు టీడీపీ కూడా మద్దతు తెలిపిందన్నారు. ఈనాడు, ఈటీవీలోని అన్నదాత కార్యక్రమం ద్వారా ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కూడా కల్పిస్తూ కథనాలు వేశారన్నారు. ఏపీలో పూర్తిస్థాయిలో ఈ చట్టం అమలులోకి రాలేదని, హైకోర్టులో కూడా ఈ చట్టం విషయమై సవాలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ కూడా దాఖలు చేసిందని సురేంద్ర చక్రవర్తి వివరించారు. భూములపై సమగ్ర సర్వే నిర్వహించి భూ రికార్డులు పరిశీలించి ప్రజలకు శాశ్వత భూ హక్కులు కల్పించాలనేదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అన్నారు. రిజిస్ట్రేషన్లలో పారదర్శకత, భద్రత, ఆస్తుల రక్షణకు ప్రభుత్వ గ్యారంటీ వంటివి ఈ చట్టం ముఖ్య లక్ష్యాలుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రికార్డు ఆఫ్ రైట్స్ చట్టంలో కేవలం రికార్డు మాత్రమే ఉంటుందని, ఆ రికార్డు ద్వారా సంక్రమించే హక్కులకు గ్యారంటీ లేదని అన్నారు. కొత్త చట్టం ద్వారా టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌ని, అప్పిలేట్ అథారిటీని హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో హైకోర్టు ఇచ్చే తీర్పే తుది తీర్పుగా పేర్కొన్నారు. ఎవరైనా ఈ భూమి రికార్డులు మార్చినా, కబ్జా చేసినా అసలైన యజమానులకు న్యాయం చేయడంతో పాటు నష్టపరిహారం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. దీంతో పాటు మీ భూమి మీకు అప్పగించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని రకాల భూ రికార్డుల స్థానంలో ఒకే ఒక టైటిల్ వస్తుందని, ప్రభుత్వం భూములు లాక్కోవడం అనేది అర్థరహితం, దుష్ప్రచారమేనని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఒంగోలు టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు కత్తి కోటేష్‌బాబు, ధర్నాశి హరిబాబు మాట్లాడుతూ భూమి పత్రాలు ప్రభుత్వం చేతిలో ఉండవని, వారసత్వం విషయంలో వివాదాలు ఉంటే కోర్టుకు వెళ్లేందుకు ఈ చట్టం అడ్డుకాదని అన్నారు. కాలక్రమంగా చట్టం అమల్లోకి వస్తుందని, అప్పటి వరకు రైతుల వద్ద ఉన్న పాసు పుస్తకాలు, రిజిస్టర్డ్ దస్తావేజులు చెల్లుబాటులోనే ఉంటాయని చెప్పారు. ఒకసారి తుది రిజిస్టర్ ద్వారా ప్రభుత్వం టైటిల్ గ్యారంటీ ఇచ్చాక మాత్రమే పాత రికార్డులు చెల్లవన్నారు. కొంతమంది భూములు లాక్కోవడానికి చేసిన చట్టంగా దీనిని సంబోధించడం సరికాదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు, ఇతర చట్టాల ద్వారా ఇచ్చిన భూమి హక్కుల్ని లాక్కోవడం జరగదన్నారు. ఉన్న హక్కుల్ని రికార్డుచేసి ఆ హక్కులకు గ్యారంటీ కల్పిస్తుందనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఇంటి నిర్మాణానికి రూ.40 వేల ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: ఇళ్లు అగ్నికి ఆహుతైన పేద కుటుంబానికి ఇంటిని పునర్నిర్మించుకునేందుకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రూ.40 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం ప్రభుదేవాకాలనీకి చెందిన కట్టా తిరుపతమ్మ ఇంటింటికి తిరిగి వెంట్రుకలు సేకరించి స్టీలు సామగ్రి ఇస్తూ జీవిస్తోంది. ఆమె భర్త గత నెలలో గుండెపోటుతో మరణించాడు. పైగా, ఆమె కడుపులో గడ్డ ఉన్నా ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక కాలం వెళ్లదీస్తోంది. ముగ్గురు చిన్నపిల్లలతో ఆమె జీవిస్తుండగా, ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగి ఆమె ఉంటున్న పూరిపాక పూర్తిగా కాలిపోయింది. దీంతో తల్లీపిల్లలు కట్టుబట్టలతో రోడ్డునపడ్డారు. విషయం తెలుసుకున్న సూర్యశ్రీ ట్రస్టు స్పందించి ప్రవాసభారతీయులు అనిల్‌కుమార్ సహకారంతో రూ.20 వేలు, హృషికేష్ సహకారంతో రూ.10 వేలు, శిల్పా రాఘవేంద్ర సహకారంతో రూ.10 వేలు కలిపి మొత్తం రూ.40 వేలను చెక్కు రూపంలో గురువారం స్థానిక ట్రస్టు కార్యాలయంలో సెక్రటరీ సర్దార్‌బాషా చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.



చెక్కు అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



జిల్లా వైద్యాధికారికి అభినందనలు తెలుపుతున్న సంఘ నాయకులు

ఒంగోలు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ అన్నారు. ప్రకాశం భవనం వైద్యశాఖ కార్యాలయం ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల నుంచి వచ్చే ప్రాణ వాయువు ప్రాధాన్యతను వివరించారు. ముందుగా యునైటెట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారిని కలిసి అభినందనలు తెలిపారు.

విజేతలను ప్రకటించిన స్వీప్ అధికారులు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా స్వీప్ బృందం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఓటుపై అవగాహన పెరిగేలా రీల్స్ పోటీ నిర్వహించారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవడం, ఎథికల్ ఓటింగ్, ఇన్‌ఫార్మ్‌డ్ ఓటింగ్, సర్వీసు ఓటింగ్ తదితర అంశాలలో రీల్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో 20 కాలేజీలకుపైగా విద్యార్థులు పాల్గొని 73 రీల్స్ రూపొందించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ రీల్స్‌ను పరిశీలించి బహుమతులు ప్రకటించినట్లు స్వీప్ నోడల్ అధికారి రవి తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు ప్రకటించారు. పోటీల్లో ఆర్‌జీయూకేటీ కాలేజీ వంశీ అండ్ టీంకు మొదటి బహుమతి, మెడికల్ కాలేజీ నుంచి నిఖిలేశ్వర్ అండ్ టీంకు రెండో బహుమతి, పేస్ కాలేజీ శివ బృందం రూపొందించిన రీల్‌కు తృతీయ బహుమతి లభించింది. విజేతలకు త్వరలో నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- కొత్తపట్నం తహసీల్దార్ హేమంత్ కుమార్

కొత్తపట్నం: ఈ నెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు మండలంలోని అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని కొత్తపట్నం తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం హాలులో గురువారం బీఎల్‌వోలు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల పోలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరూ పోలింగ్ రోజు ఉదయం 4 గంటలకే పోలింగ్ బూత్‌లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి అర్ధగంట ముందు మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో కొత్త మనుషులు ఐదుగురు నుంచి 10 మంది వచ్చి ఉంటే బీఎల్‌వోలు ముందుగా గుర్తించి ఆ సమాచారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండలంలో 53 బూత్‌లు ఉన్నాయని, పోలింగ్ బూత్ ప్రాంతంలో బారికేడ్‌లు, టెంట్లు, బల్లలు, పోలింగ్‌కు సంబంధించిన ప్రతి వస్తువును సిద్ధం చేసుకోవాలని సూచించారు. భోజనాలు, టిఫిన్లు, తాగునీరు, ఇతర వసతులను బీఎల్‌వోలు అందుబాటులో ఉంచుకోవాలని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎక్కువ మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్సై బి.సాంబశివరావును ఆదేశించారు. బీఎల్‌వోలు ఓటర్ స్లిప్‌లను 100 శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

1,726 పోస్టల్ బ్యాలెట్లు నమోదు

- 2019తో పోలిస్తే 222 ఓట్లు పెరుగుదల

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం 222 పోస్టల్ బ్యాలెట్లు పెరిగాయి. 2019లో మొత్తం 1,626 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా, వాటిలో 121 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఒక ఓటు నోటాకు పడింది. ప్రస్తుతం మొత్తం 1,785 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,726 ఓట్లు పోలయ్యాయి. అప్పటితో పోలిస్తే 222 ఓట్లు పెరిగాయి. కాకపోతే గతేడాది లేకుండా ప్రస్తుతం అదనంగా వచ్చింది హోమ్ ఓటర్లు. నియోజకవర్గంలో వీరు 182 మంది దరఖాస్తు చేసుకోగా, 179 పోలయ్యాయి.